# కొత్త రేషన్ కార్డులకు మోక్షమెప్పుడో?

**ఆశగా ఎదురు చూస్తున్న అర్హులు**

**గుడివాడరూరల్:** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలు పూర్తి కావస్తున్నా కొత్త రేషన్ కార్డులకు సంబంధించి తగిన ఆదేశాలు ఇవ్వకపోవడంతో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. గుడివాడ నియోజకవర్గంలో వందలాది మంది అర్హులు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం దీనిపై అసలు ఆలోచన చేస్తున్నట్లే లేదు. రేషన్ కార్డుల కోసం అర్హులైన వారు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాకుండా ఏమీ చేయలేమని సచివాలయ సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. దీంతో అక్కడికి వెళ్లిన ప్రజలకు నిరాశగా తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్డుల్లో చేర్పులు, మార్పులకు కూడా అవకాశం ఉండటం లేదు.

### హామీలతో సరిపెట్టారు

అధికారం కోసం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక మాత్రం వాటిని పట్టించుకోవడం లేదు. రేషన్ కార్డులు అనేక సంక్షేమ పథకాల అమలుకు ఆధారం. కార్డులు మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం ఇంత జాప్యం చేస్తుండటంతో ప్రజలు మండిపడుతున్నారు.

### వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటి వద్దకే సేవలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల మంజూరు పారదర్శకంగా జరిగేది. అర్హులైన ప్రజలు సచివాలయం వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే వెంటనే కార్డులు మంజూరయ్యేవి. కొన్ని సందర్భాల్లో గంటల వ్యవధిలో కూడా కార్డులు మంజూరు చేశారు. కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చుకోవాలన్నా, తొలగించాలన్నా సచివాలయం పని దినాల సమయంలో ప్రభుత్వ సైట్లు ఎప్పుడూ అందుబాటులోనే ఉండేవి. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వారే స్వయంగా దరఖాస్తు చేసి కార్డు మంజూరైతే ఇంటికి తీసుకొచ్చి లబ్ధిదారులకు అందజేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసినప్పటి నుంచి సైట్లన్నీ మూసేశారు. ఇదేమి పాలన అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


రేషన్‌కార్డులు (ఫైల్)

**కొత్త కార్డులు ఎప్పుడు మంజూరు చేస్తారు?**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తవుతుంది. ఇప్పటి వరకు కొత్త కార్డుల ఊసేలేదు. కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం లేదు. అసలు సైట్లే ఓపెన్ కావడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కొత్త కార్డుల మంజూరుకు మార్గదర్శకాలు జారీ చేయాలి.

– శ్రీనివాసరావు, నందివాడ

**కార్డులకోసం ఎదురుచూపులు**

గత ప్రభుత్వ హయాంలో గంటల వ్యవధిలో రేషన్ కార్డులు వచ్చేవి. వలంటీర్లు ఇంటింటికీ వచ్చి కార్డులు కోసం దరఖాస్తులు చేయించేవారు. ప్రస్తుతం కార్డులు సకాలంలో అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో వందలాది మంది కొత్త కార్డుల కోసం, చేర్పులు, మార్పుల కోసం ఎదురు చూస్తున్నారు.

– కె.అశోక్, గుడివాడ

**మార్గదర్శకాలు రావాల్సి ఉంది**

కొత్త కార్డుల మంజూరు, కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. త్వరలో వచ్చే అవకాశం ఉంది. వచ్చిన వెంటనే సమాచారాన్ని ప్రజలందరికీ తెలియజేస్తాం.

– కిరణ్, సివిల్ సప్లయ్స్ డీటీ, గుడివాడ

# భక్తుల కోర్కెలు తీర్చే గంగానమ్మతల్లి


శ్రీ గంగానమ్మ తల్లి

**నేటి నుంచి అమ్మవారి జాతర**

**పామర్రు:** భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారమైన పామర్రు గంగానమ్మతల్లి జాతరను ఈ ఏడాది వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన గంగానమ్మ తల్లి జాతరను సోమవారం నుంచి ఈ నెల 9 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

**ఆలయ ప్రాశస్త్యం**

అనారోగ్యానికి గురైన వారికి గంగానమ్మ తల్లి అభయమిస్తూ, సంతానం లేని వారికి సంతానాన్ని ప్రసాదిస్తూ భక్తుల పాలిట కల్పతరువుగా శోభిల్లుతోంది. గంగానమ్మ తల్లి ఆలయానికి 250 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. భక్తులను అనుగ్రహిస్తూ కోరిన వారికి కొంగు బంగారమై పూజింప బడుతున్న మహిమాన్విత శక్తి రూపిణి గంగానమ్మ తల్లి అని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు రోజూ గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో అమ్మవారు ఊరేగింపు నిర్వహిస్తారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ఆదివారం మాట్లాడుతూ ఏడు రోజుల పాటు జరిగే ఈ జాతర మహోత్సవానికి రాష్ట్రంలోని నలు మూలల నుంచి భక్తులు వస్తారని తెలిపారు. అమ్మవారి ఘటం కుండను, పోతురాజు గడలను మేళ తాళాలతో ఊరేగింపుగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

**నేటి నుంచి కార్యక్రమాలు ప్రారంభం**

సోమవారం తెల్లవారుజామున గంగనమ్మతల్లిని మేళ తాళాలు, కనక తప్పెట్లతో ఊరేగింపుగా ఆమె పుట్టినిల్లు అయిన బొమ్మారెడ్డి వారి కుటుంబీకులైన బొమ్మారెడ్డి మాధవరెడ్డి ఇంటి వద్దకు తీసుకెళ్లి పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను తీసుకొచ్చి ఆలయంలో అమ్మవారికి అలంకరించి జాతరను ప్రారంభిస్తారు. తొలిరోజే గ్రామంలోని నాలుగు పొలిమేరల్లో కట్టుని నిర్వహించి దుష్ట శక్తులు ప్రవేశించకుండా కట్టడిని చేస్తారు. ఆ తర్వాత గంగానమ్మను గ్రామంలో ఊరేస్తారు. చివరి రోజైన 9వ తేదీన అమ్మవారు ఆలయ ప్రవేశం జరిగిన తర్వాత భక్తులు తమ మొక్కులను తీర్చుకుంటారు.


ఆలయ ముఖద్వారం


**భక్తులకు మెరుగైన సౌకర్యాలు**



గంగానమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయం చుట్టూ ప్రాకార మండపంతో పాటు ఆలయానికి శిఖరానికి రంగులు వేశాం. ఈ ఏడాది సామాన్య భక్తులు అమ్మవారి దర్శనం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఆలయంలో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశాం. పోలీసుల గస్తీ నిరంతరం ఉంటుంది.

– నందిపాటి బాల వెంకటేశ్వరరెడ్డి, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు

## పొగమంచుతో ఇక్కట్లు


గుడ్లవల్లేరు వైఎస్సార్ బ్రిడ్జిపై కమ్ముకున్న పొగమంచు

పొగమంచుతో తమ ప్రయాణంలో రాకపోకలు కొనసాగించే వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. గుడ్లవల్లేరులో ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకు పొగమంచు తగ్గుముఖం పట్టలేదు. దీంతో ఆ మంచులో వాహనచోదకులు లైట్లు లేకుండా ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొంది.

– గుడ్లవల్లేరు

## మహిళ అదృశ్యంపై కేసు

**కైకలూరు:** భార్య కనిపించడం లేదంటూ భర్త కైకలూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు కై కలూరు మండలం చటాకాయి గ్రామానికి చెందిన కురేళ్ల నాగలక్ష్మితో మండవల్లి మండలం అయ్యవారిరుద్రవరం గ్రామానికి చెందిన నాగమురళీకృష్ణతో ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ పిల్లలున్నారు. చటాకాయిలో వారు కాపురం ఉంటున్నారు. ఫిబ్రవరి 28 నుంచి భార్య కనిపించడం లేదని నాగమురళీకృష్ణ అందించిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ వి.రాంబాబు కేసు నమోదు చేశారని సిబ్బంది తెలిపారు.

## కలిదిండిలో వాహనాల దారి మళ్లింపు

**కైకలూరు:** కలిదిండి మరియమ్మ ఉత్సవాల సందర్భంగా సోమవారం ట్రాఫిక్ దారి మళ్లిస్తున్నట్టు రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ఈ నెల 1న ప్రారంభమైన ఉత్సవాలు మూడో తేదీ వరకూ కొనసాగుతాయని పేర్కొన్నారు. చివరి రోజు భారీగా భక్తులు హాజరవుతారన్నారు. ఈ కారణంగా సోమవారం సాయంత్రం 5 నుంచి రాత్రి 12 గంటల వరకు గుడివాడ నుంచి కలిదిండి మీదుగా భీమవరం వెళ్లే బస్సులు, లారీలు, ట్రక్కులు కోరుకొల్లు నుంచి కై కలూరు మీదుగా వెళతాయన్నారు. బైక్‌లు, ఆటోలు, కార్లు కలిదిండి బస్టాండ్ పక్క కోట కలిదిండి మీదుగా తటవర్తి టైల్స్ వద్ద నుంచి మెయిన్‌రోడ్డుకు చేరుతారన్నారు. భీమవరం నుంచి కైకలూరు, గుడివాడ వెళ్లే భారీ వాహనాలు ఉప్పుటేరు వద్ద సున్నంపూడి మీదుగా చేరుతాయని తెలిపారు. చిన్న వాహనాలు భోగేశ్వరం ఆర్చి వద్ద నుంచి బంగ్లా మీదుగా పెద్ద మసీదు, కాలువ గుట్టు, పేట కలిదిండి, మల్లమ్మ హోటల్ వద్ద మెయిన్ రోడ్డు నుంచి వెళతాయని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం



**కూచిపూడి(మొవ్వ):** నెల రోజులు పాటు కొనసాగే రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొవ్వ మండలంలోని నిడుమోలు, కోసూరు తురకపాలెం, మొవ్వ, పెదపూడి, భట్లపెనుమర్రులోని ఒక మసీదులో కాజలో రెండు మసీదులలో ఐదు సార్లు ప్రార్థనలు నిర్వహించి ఖురాన్ పఠించారు.

### మటన్‌పై మక్కువ



**గుడ్లవల్లేరు:** బర్డ్‌ఫ్లూతో చికెన్‌కు మాంసాహార ప్రియులు దూరమై మటన్‌పై మక్కువ చూపుతున్నారు. ఆదివారం మార్కెట్‌లో చికెన్ దుకాణాలు బోసిపోయాయి. మటన్ షాపులు మాత్రం మాంసాహార ప్రియులతో కళకళలాడాయి. చికెన్ కిలో రూ.150 ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. మటన్ కిలో రూ.800 ఉన్నా 1/4కిలో తిన్నా చాలు అనుకుని దాన్ని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు.

### ఉచిత వైద్యశిబిరం



**గుడ్లవల్లేరు:** ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరులో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 468మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ వెంకట్రావు, గుండె, ఊపిరి తిత్తులు తదితర సంబంధ వ్యాధులకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

**గుడివాడలో..**

**గుడివాడ టౌన్:** రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యబృందంచే నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బి. బాలకృష్ణ, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ అశోక్, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు టిఎన్. రాజశేఖర్, జి.కిరణ్‌బాబు, పూర్వ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏజే ప్రసాదు పాల్గొన్నారు.

### కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



**గుడ్లవల్లేరు:** శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆదివారం అధికసంఖ్యలో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

### చలివేంద్రం ప్రారంభం

**గుడ్లవల్లేరు:** కౌతవరం శివారు పద్మాలపాలెంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆదివారం మారుబోయిన రాకడ మణిమ్మ మెమోరియల్ చారిటబుల్ సొసైటీ వారి ఆర్థిక సాయంతో వాటర్ కూలర్ చలివేంద్రాన్ని కృష్ణా మిల్క్ యూనియన్ సొసైటీ డైరెక్టర్ వల్లభనేని బాబూరావు చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో సాగునీటి డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, రెవరెండ్ సీహెచ్.యోహాన్ దేవదాస్ పాల్గొన్నారు.

### క్రమశిక్షణతో నడుచుకోవాలి



**గుడివాడరూరల్:** రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉంటూ క్రమ శిక్షణతో నడుచుకోవాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రౌడీషీటర్లు, చెడునడత ఉన్న వ్యక్తులు నేరాలను వదిలి స్వేచ్ఛగా జీవించాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు.

### కరాటేలో గౌతమ్ విద్యార్థి ప్రతిభ



**గుడివాడ టౌన్:** జవహర్‌లాల్ మెమోరియల్ ఆల్ ఇండియా కరాటే-డో-చాంపియన్‌షిప్-2025లో తమ విద్యార్థి ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ బహుమతి సాధించారని గౌతమ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ పి. లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆదివారం పాఠశాల ఆవరణలో విజయం సాధించిన విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ పి.సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

### మలాసు నీటి విడుదలతో చేపల పండగ



**గుడ్లవల్లేరు:** ఏటా మలాసు నీటిని ఉయ్యూరు షుగర్ ఫ్యాక్టరీ నుంచి పుల్లేటి కాల్వకు వదులుతారు. ఆదివారం ఆ నీటిని విడుదల చేయటంతో గుడ్లవల్లేరు పుల్లేటి కాల్వలో చేపల పండగ జరిగింది. ఈ చేపల వేటలో దొరికిన జాలర్లకు దొరికినన్ని చేపలు పట్టుకోవచ్చు. ఈ చేపల వేటలో పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ఉంటుంది. ఈ వేటలో కాల్వలో దిగలేని నాన్ వెజ్ ప్రియులు చేపలు కొనేందుకు పుల్లేటి కాల్వ గట్టు వెంబడి కనిపించారు.



### కార్తికేయుని ఆలయంలో భక్తుల సందడి

**మోపిదేవి:** స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం ఉదయం రాష్ట్రవ్యాప్తంగా తరలి విచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. ఆలయంలో భక్తులతో కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లివృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## 5న దేవాలయ చెరువుకు వేలం పాట

**ఉరుటూరు(పామర్రు):** దేవవాదాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఉరుటూరు సీతారామస్వామి దేవస్థానానికి చెందిన చెరువును ఈ నెల 5వ తేదీ ఉదయం 11 గంటలకు దేవస్థానం ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. రీ సర్వే నెం.61/1లో ఎకరాలు 0-71, 1/2/27లో ఎకరాలు 6.32, రీ సర్వే నెం.1/22/1లో ఎకరాలు 1.60 , మొత్తం 8.63 ఎకరాల చెరువును మూడేళ్ల పాటు లీజుకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చెరువులో చేపలు పెంచుకొని, పట్టుకునే కౌలు లీజు వేలం పాటను దేవదాయ ధర్మాదాయ శాఖ గుడివాడ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.25వేలు ధరావత్తుగా చెల్లించి పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.


**సత్రంలోని దుకాణాలకు..**

**పామర్రు:** ఎండోమెంట్ ఆధ్వర్యంలో ఉన్న శ్రీ బొమ్మారెడ్డి పెద బుల్లియ్య ఎలియాస్ వెంకటరెడ్డి సత్రంలో ఉన్న రెండు షాపులకు ఈ నెల 5వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. పాటలో పాల్గొనే వారు రూ.20 వేలు డిపాజిట్‌గా చెల్లించాలని పేర్కొన్నారు. వివరాల కోసం ఆలయ మేనేజర్‌ను సంప్రదించాలని కోరారు.

# విద్యతో జ్ఞాన సముపార్జన


మాట్లాడుతున్న సీఈఓ అజయ్‌కుమార్

**గుడ్లవల్లేరు:** విద్యతో జ్ఞాన సముపార్జన చేయాలని తోటపల్లి హీల్ పారడైజ్ సీఈఓ, మాజీ ఐఆర్ఎస్ అధికారి కూరపాటి అజయ్‌కుమార్ అన్నారు. గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ హైస్కూల్లో ఆదివారం జరిగిన వార్షికోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమానికి హైస్కూల్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరావు వల్లూరుపల్లి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అజయ్‌కుమార్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. చదువు గొప్ప జ్ఞాన సంపదను, క్రమశిక్షణను, ఆత్మ విశ్వాసాన్ని కలిగిస్తుందన్నారు. ఉన్నతంగా రాణించిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు వివిధ రకాల టాలెంట్ టెస్టుల్లో విజయం సాధించిన విద్యార్థులు, శిక్షణను ఇచ్చిన అధ్యాపకులను సత్కరించారు. తొలుత సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులు విచిత్ర వేషధారణ శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. హైస్కూల్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


రింగుల నృత్యంతో ఆకట్టుకున్న చిన్నారి

# ఊపందుకున్న మినుము తీతలు


పసుభొట్లపాలెంలో మినుము నూరుస్తున్న హార్వెస్టర్

**గుడ్లవల్లేరు:** మండలంలో మినుము తీతలు ఊపందుకున్నాయి. మండలంలో సుమారు 25వేల ఎకరాల్లో మినుము సాగు చేశారు. గత వరి కోతల్లోనే గాక కోత మిషన్లను మినుము తీతలకు కూడా రంగంలోకి దింపుతున్నారు. గంటకు ఎకరం చొప్పున ఈ హార్వెస్టర్లు కోత కోయటమే గాక మినుము దిగుబడులను నూర్చి అక్కడికక్కడే ఇచ్చేస్తున్నాయి. ఈ మిషన్లకు గంటకు రూ.2,300 చొప్పున రైతుల నుంచి వీటి యజమానులు తీసుకుంటున్నారు. అదే కూలీలతో మినుము తీతలు తీయించి, పోగులు వేసి, డబ్బా మిషన్లతో నూర్పిస్తే ఎకరానికి రూ.14,500 ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు.


అంగలూరులో మినుము తీస్తున్న కూలీలు


మొవ్వలో మిషన్ సాయంతో నూర్పిడి

**మొవ్వలో..**

**మొవ్వ:** మండలం మినుము తీత పనులు సాగుతున్నాయి. ఒడిశా పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన కూలీలు, దివిసీమ ప్రాంతాల నుంచి వచిన కూలీలతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అధిక శాతం మంది రైతులు మిషన్లతో నూర్పిడి చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మినిము రేటు తక్కువగా ఉందని రైతులు నిరాశను వ్యక్తం చేస్తున్నారు.

# ఆధునిక సాంకేతికతను అలవర్చుకోవాలి

**కైకలూరు:** ఆక్వా రైతులు ఆధునిక సాంకేతికతను అలవర్చుకోవాలని ఆక్వా డాక్టర్ అమిరినేని రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక సీఎన్నార్ గార్డెన్‌లో నెల్లూరు ఫెడోరా సీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వెనామీ రొయ్యల పెంపకంలో మేలైన ఆరోగ్య యాజమాన్యం, సాంకేతిక విశ్లేషణ అనే అంశంపై అవగాహన సమావేశం ఆదివారం నిర్వహించారు. రొయ్యల సాగులో రైతులను ఇబ్బంది పెడుతున్న వ్యాధులు వైట్ ఫుట్, ఈహెచ్‌పీల లక్షణాలు, నివారణ అంశాలను డాక్టర్ రవికుమార్ రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.


సీఎన్నార్ గార్డెన్‌లో ఫెడోరా సీ ఫుడ్ అధికారులు

### వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



**తోట్లవల్లూరు:** శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవం మండలంలోని యాకమూరులో ఆదివారం వైభవంగా జరిగింది. స్థానిక శ్రీనగర్ కాలనీలో చింతకింది సమతా చరణ్‌రెడ్డి, శివకుమారి దంపతుల ఆధ్వర్యంలో శ్రీనివాసుని కల్యాణం రమణీయంగా సాగింది. స్వామి కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు, చింతకింది విష్ణుప్రియాదేవి, చింతకింది మధురెడ్డి దంపతులు, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులు కల్యాణోత్సవ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

### రక్తదానం

**గుడివాడ టౌన్:** కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదానం చేశారు. ముదినేపల్లి మండలం చిగురుకోటకు చెందిన మహిళకు గుడివాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయుటకు రక్తం అవసరమైంది. దీంతో ట్రస్ట్ సభ్యుడు దేసు సురేష్ స్పందించి రక్తదానం చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ల సీతయ్య తెలిపారు.